నరక బాట

- గుంతలమయంగా రహదారులు
- హామీ నెరవేర్చని ప్రభుత్వం
- కనీస మరమ్మతులు కూడా చేయని వైనం
- మండిపడుతున్న ప్రజలు

సంక్రాంతికి రోడ్లు బాగుపడతాయన్నారు. గుంతలు లేని రహదారులు స్వాగతం పలుకుతాయన్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆర్భాటంగా ఆదేశాలు జారీ చేశారు. తీరా వాస్తవంలోకి వచ్చే సరికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కేశారు. కూటమి ప్రభుత్వ వైఖరిపై ప్రజలు మండిపడుతున్నారు. నరకమార్గాలుగా మారిన రోడ్లను తలచుకుని ఆందోళన చెందుతున్నారు. రహదారుల నిర్మాణానికి రూ.కోట్లు వెచ్చిస్తున్నామంటూ ప్రభుత్వ పెద్దలు ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పండుగ జరుపుకునేందుకు పల్లెకు రావాలంటేనే బంధుమిత్రులు హడలిపోతున్నారని ఆరోపిస్తున్నారు. అధ్వానంగా తయారైన రోడ్లపై ప్రయాణం సాగించాలంటే నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

–చిత్తూరు రూరల్ (కాణిపాకం)/ ఐరాల /బంగారుపాళెం





అధ్వానంగా ఉన్న నల్లవెంకటయ్యగారిపల్లె తారు రోడ్డు

- చిత్తూరు మండలంలోని నల్లవెంకటయ్యగారిపల్లె తారు రోడ్డు అధ్వానంగా ఉంది. చెరువు కట్టమీద నుంచి గుడిపాల మండలం శెట్టినతంగాల్ సరిహద్దు వరకు రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఊరు సమీపంలోని చెరువు కట్టపై బీటలు వారాయి. కట్ట కూడా కిందకు కుంగింది. అక్కడక్కడా గుంతలు దర్శనమిస్తున్నాయి. అలాగే కంకర తేలి వాహన చోదకులకు పరీక్ష పెడుతున్నాయి.
- ఐరాల మండలంలోని చిన్నవెంకటంపల్లె నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో వాహనదారులు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. రాత్రిళ్లు ద్విచక్రవాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.
- బంగారుపాళెం– రాగిమానుపెంట, బంగారుపాళెం–గుంతూరు, బంగారుపాళెం బోడబండ్ల, బలిజపల్లె– జయంతి, టేకుమంద, కీరమంద, బండ్లదొడ్డి, కాటప్పగారిపల్లె రాగిమానుపెంట–కేఎంకండ్రిగ, సంక్రాంతిపల్లె–మంగళపల్లె, మిట్టపల్లె– నూనెగుండ్లపల్లె, నలగాంపల్లె–తంబుగానిపల్లె, జిల్లేడుపల్లె, తిమ్మోజుపల్లె–బొమ్మాయిపల్లె, సత్రం– చిల్లగుండ్లపల్లె, బంగారుపాళెం– తూంపాయపల్లె, నల్లంగాడు–శెట్టేరి, తుంబకుప్పం క్రాస్–తుంబపాళెం రోడ్లు గుంతల మయంగా మారాయి.

- చిత్తూరు మండలంలోని తాళంబేడు–గుడిపాల మండలంలోని చీలాపల్లికి వెళ్లే రోడ్డు గుంతలకు కేరాఫ్‌గా నిలిచింది. అడుగుకు ఓ గుంత దర్శనమిస్తోంది. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతన్నారు. వర్షానికి రొచ్చు..రొచ్చుగా తయారవుతున్నాయి. అయితే సంక్రాంతికి రోడ్డు బాగుపడుతుందని కలగన్న పల్లె ప్రజలకు చుక్కెదురైంది. ప్రాణాల మీదకు వస్తున్నా కనీసం అతుకులు కూడా వేయడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.



- ఐరాల మండలం 35 యర్లంపల్లె నుంచి గుట్టకిందపల్లెకు వెళ్లే రోడ్డు దయనీయంగా ఉంది. గ్రామాల్లో తారు రోడ్డు మరమ్మతులకు కూడా కూటమి ప్రభుత్వం నిధులు విదల్చడం లేదని పలువురు వాపోతున్నారు. అనేక చోట్ల ఇప్పటికీ అతుకు గతుకుల రోడ్లల్లో ప్రయాణం సాగించాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తవణంపల్లె మండలంలో 37 సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడితే ఇప్పటి వరకు ఒక్క పనికూడా పూర్తి కాలేదు. కొన్ని చోట్ల గుంతలు పూడ్చి చేతులు దులిపేసుకున్నారు. అలాగే చిత్తూరు– అరగొండ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.



ఐరాల మండలంలోని చిన్నవెంకటంపల్లె నుంచి ఇందిరానగర్ మార్గంలో కంకర తేలిన రోడ్డు



రాగిమానుపెంట రోడ్డు



గుంతూరు రోడ్డు

క్లుప్తంగా

సత్యమ్మకు విశేష పూజలు



పూజలో ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి తదితరులు

తవణంపల్లె: మండలంలోని కె.పట్నం గ్రామం నడివీధిలో ఉన్న సత్యమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అంబలి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం పెట్టారు. ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి, దూర్వాసులు రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, హేమచంద్రా రెడ్డి, గిరిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని రాములువారి గుడి వీధిలో ఉన్న శ్రీకోదండ రామస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణ మహోత్సవానికి కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గోదాదేవి నీరాటోత్సవం జరిపించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక అలంకరించారు. కన్యాకపరామేశ్వరి ఆలయంలో పూజలు చేసి దేవతమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణోత్సవ వేదికపై ఆశీనులు చేశారు. అనంతరం వేడుకగా కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి



శ్రీనివాసులు

వి.కోట: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకాంక్షించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దక్షిణాయనానికి ఆఖరు రోజులైన మూడు రోజుల సంక్రాంతి ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ, ఈ ఏడాది అన్ని పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

హోమియో డాక్టర్‌గా ఉమారాణి



పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ హోమియోపతి డాక్టర్‌గా ఉమారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఆమె విజయం సాధించి ఇక్కడ డాక్టర్‌గా నియమితులయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక హోమియో ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలని అందిస్తామని ఆమె చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్ట్ మృతి



గాయపడిన బాలాజిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

చౌడేపల్లె: రోడ్డు ప్రమాదంలో ఓ మోటార్ సైక్లిస్టు తీవ్రంగా గాయపడి మరణించిన సంఘటన సోమవారం రాత్రి పుంగనూరు–బోయకొండ మార్గంలోని కొలింపల్లె సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..పుంగనూరుకు చెందిన బాలాజి(40) బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చి బైక్‌లో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని కొలింపల్లె వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని 108 సిబ్బంది మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు.

అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు కార్పొరేషన్: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు విద్యుత్ ఉపకరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గాలిపటం ఎగరవేయరాదని, పిల్లలు మేడ మీద పతంగులు ఎగుర వేసేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా దగ్గర ఉండాలన్నారు. పొరబాటున గాలిపటం వైర్ల మీద పడటం, చుట్టుకున్నప్పుడు చేతితో తాకరాదన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన సంబంధిత లైన్‌మెన్, ఏఈను సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆరోద్రోత్సవం



197రామాపురం వీధుల్లో విహరిస్తున్న యజ్ఞేశ్వరస్వామి

గుడిపాల: మండలంలో 197రామాపురంలోని శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత యజ్ఞేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ఆరోద్రోత్సవం మల్లెలనాయండి వంశస్తులు సాంప్రదాయంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేక, ప్రత్యేక పూజార్చన కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవమూర్తులైన జ్ఞానప్రసూనాంబ సమేత యజ్ఞేశ్వరస్వామికి విశేషాలంకరణతో అలంకరించి, నందివాహనంపై స్వామివారు సతీసమేతుడై ఆశీనులై, గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో మల్లెలనాయండి వంశస్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



ఊరేగుతున్న అమ్మవారు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ అనుబంధ గుడి శ్రీదేవి భూదేవి సమేత వరదరాజులస్వామి ఆలయంలో సోమవారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శనం భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. అలాగే పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించారు.

భక్తిశ్రద్ధలతో భోగి



టి.పుత్తూరులో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు భోగి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కష్టాలను తొలగిపోవాలని ప్రార్థించారు. ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు.

నిరాశాజనకంగా కొనుగోళ్లు

సంక్రాంతి పండుగకు కొనుగోళ్లు నిరాశాజనకంగా ఉన్నట్టు వ్యాపారులు తెలిపారు. సోమవారం వర్షం కురవడంతో మరింతగా కొనుగోళ్లు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాజీ మంత్రి ఆధ్వర్యంలో

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్రనాయుడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, అమర హాస్పిటల్ అధినేత డాక్టర్ రమాదేవి, సినీ హీరో గల్లా అశోక్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండలంలోని టి.పుత్తూరు నడివీధిలో భోగి మంట వేశారు. కోదండరామాలయంలో విశేషపూజలు నిర్వహించారు. ధర్మకర్త సిద్ధేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



భోగి మంట వేస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కుటుంబసభ్యులు

బంగారుపాళెం: మండలంలో భోగి పండుగ జరుపుకున్నారు.

ఐరాల: భోగి పండుగ సందర్భంగా పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

గుడిపాల మండలంలో..

గుడిపాల: గుడిపాలలో సోమవారం తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగుల ముగ్గులు చేశారు. 189కొత్తపల్లె వీధుల్లో సంక్రాంతికి వీధిలైట్లు గ్రామస్తులు వేయించారు.

అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు



తవణంపల్లె: అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి వేడుకలను భక్తిప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి అభిషేకం చేశారు. అనంతరం గంధం, వివిధ రకాల పుష్పాలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

పౌర్ణమి సందర్భంగా అర్చకులు భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. రాత్రి ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు జరిపించారు. స్వామివారిని పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ హనుమంతురావు పాల్గొన్నారు.